


విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 05-08-2022 సంపుటి : 03 సంచిక : 305 పేజీలు : 4 వెల : రూ 3-00


# జగనన్న విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తుల ఆహ్వానం



అమరావతి: జగనన్న విదేశీ విద్యాదీవెన కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ పథకం కింద ప్రపంచంలో టాప్ 200లోపు క్యూఎస్ వరల్డ్ ర్యాంకుల్లో ఉన్న విదేశీ విశ్వవిద్యాలయాలు/విద్యా సంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ అభ్యసించాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. ఈ వర్గాలకు చెందిన 35 ఏళ్లలోపువారు జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తు చేసుకోవచ్చు.డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియెట్‌ల్లో 60 శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్ కలిగి ఉండాలి. ఎంబీబీఎస్ కోర్సుకు నీట్‌లో అర్హత సాధించి ఉండాలి. ప్రపంచంలో టాప్ 100లోపు ర్యాంకు గల విశ్వవిద్యాలయాలు/విద్యా సంస్థల్లో ప్రవేశం పొందితే ప్రభుత్వమే 100 శాతం ఫీజు చెల్లిస్తుంది. 101 నుంచి 200లోపు ర్యాంకు కలిగినవాటిలో అడ్మిషన్ పొందితే రూ.50 లక్షలు, 50 శాతం ఫీజుల్లో ఏది తక్కువ అయితే అది ప్రభుత్వం భరిస్తుంది.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కుమార్తె వివాహానికి హాజరయిన సీఎం జగన్



కాకినాడ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ కుమార్తె వివాహం నిమిత్తం గురువారం ఉదయం కాకినాడ జిల్లా తునిలో రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు వ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేరుకున్నారు. అయనకు రాష్ట్ర మంత్రులు, శాసనమండలి, శాసన సభ్యులు, జిల్లా అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు రాజకీయ ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, శాసనమండలి సభ్యులు పండుల రవీంద్రబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్ దవులూరి దొరబాబు, పిఠాపురం, జగ్గంపేట, కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పెండెం దొరబాబు, జ్యోతుల చంటిబాబు, కురసాల కన్నబాబు, కాకినాడ జిల్లా కలెక్టరు డా. కృతికా శుక్లా, అనకాపల్లి జిల్లా కలెక్టరు రవికుమార్ పటాన్ శెట్టి, కాకినాడ ఎస్పీలు ఎం.రవీంద్రనాథ్ బాబు,తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు, పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు, పెందుర్తి శాసనసభ్యులు అన్నమరెడ్డి అదీప్ రాజ్ కాకినాడ నగరపాలక సంస్థ మేయర్ సుంకర శివ ప్రసన్న, తుని పురపాలక సంఘం చైర్ పర్సన్ ఏలూరిసుధారాణి,ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్ మెంబర్ ఎన్.సోనివుడ్, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఇతర ప్రజాప్రతినిధులు తుని పురపాలక సంఘం కౌన్సిలర్లు, రాజకీయ ప్రముఖులు అయనను కలిసిన వారిలో ఉన్నారు..

# ఆ తల్లి కష్టం చూసి చలించి.. సీఎం జగన్ సత్వర సాయం



కాకినాడ: జిల్లాలోని తునిలో తన పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మరోమారు తన మంచిమనుసును చాటుకున్నారు. జనాల మధ్య చంటిబిడ్డతో ఉన్న ఓ తల్లిని గుర్తించి.. తన కాన్వాయ్‌ను ఆపించి దిగారు. ఆ తల్లి వివరాలు అడిగి తెలుసుకుని.. ఆమె కష్టానికి చలించిపోయారు. ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం మండపం గ్రామానికి చెందిన తనూజకు ఓ కొడుకు ఉన్నాడు. ఆ బిడ్డ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సాయం కోసం ఆమె సీఎం జగన్‌ను కలవాలని ప్రయత్నించి ంది. ఆ ప్రయత్నంలోనే చంటిబిడ్డను సీఎం కాన్వాయ్‌కు కనిపించేలా ప్రయత్నించింది. అది గమనించిన సీఎం జగన్.. కాన్వాయ్‌ను ఆపించారు. ఆ తల్లీబిడ్డలను పిలిపించుకుని సమస్య తెలుసుకున్నారు.తన బిడ్డ ఆరోగ్య పరిస్థితిని సీఎం జగన్‌కు వివరించి ఆదుకోవాలని తనూజ కోరడంతో ఆయన సత్వరమే స్పందించారు. కాకినాడ జిల్లా కలెక్టర్‌కు సమస్యను పరిష్కరించాలని ఆదేశించి.. అప్పటికప్పుడే ఆమెకు సాయం అందేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారు.

# హైకోర్టు నూతన జడ్జిలుగా ఏడుగురు ప్రమాణస్వీకారం




అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన ఏడుగురు న్యాయాధికారులు గురువారం ప్రమాణం చేశారు. ఏపీ రవీంద్రబాబు, డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ సాగర్, బండారు శ్యాం సుందర్, ఊటుకూరు శ్రీనివాస్, బొప్పన వెంకట లక్ష్మీ నరసింహ చక్రవర్తి, తాళ్లప్రగడ మల్లికార్జునరావు, దుప్పల వెంకటరమణలతో గవర్నర్ హరిచందన్ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణం చేయించారు.వాస్తవానికి ప్రమాణ స్వీకారం చేయించే విషయంలో గవర్నర్ తన అధికారాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బదలాయిస్తారు. దీంతో కొత్త న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి (సీజే) ప్రమాణం చేయించడం ఆనవాయితీ. సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు మాతృవియోగం కలగడంతో ఆయన వచ్చే పరిస్థితి లేదు. దీంతో గవర్నర్ కొత్త న్యాయమూర్తులతో ప్రమాణం చేయించారు.

# ఏపీ హైకోర్టును కర్నూలుకు మార్చే ప్రతిపాదన లేదు : కేంద్ర మంత్రి



అమరావతి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టును కర్నూలుకు మార్చే ప్రతిపాదన కేంద్రం వద్ద పెండింగ్ లో లేదని న్యాయమంత్రిత్వ శాఖ మరోసారి వెల్లడించింది. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ రాజ్యసభలో గురువారం లేవనెత్తిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సమాదానమిచ్చారు. విభజన చట్టానికి అనుగుణంగా 2019లో జనవరిలో ఏపీ హైకోర్టు ప్రధాన బెంచ్‌ను కేంద్రం ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2020 ఫిబ్రవరిలో ఏపీ హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. హైకోర్టును కర్నూలుకు మార్చడంపై ప్రభుత్వం, హైకోర్టు తమ అభిప్రాయాన్ని కేంద్ర న్యాయశాఖకు సమర్పించాలన్నారు. ప్రస్తుతం కేంద్రం దగ్గర ఎలాంటి ప్రతిపాదన పెండింగ్‌లో లేదని కేంద్రమంత్రి వివరించారు.

# వరదలో చిక్కుకున్న వ్యక్తి సురక్షితం

అనంతపురం వర్షాలు తగ్గుముఖం పట్టిన వరదలు ఉధృతి ఇంకా కొనసాగుతూనే ఉంది. అనంతపురం జిల్లా తాడిపత్రి పెన్నా నది వంతెన వద్ద వరద భీభత్సం కొనసాగుతోంది.ఈ క్రమంలో వరదలో చిక్కుకున్న వ్యక్తిని పోలీసులు సురక్షితంగా రక్షించారు.వంతెన కంద వ్యక్తి చిక్కుకున్నాడని గుర్తించి పోలీసులు చాకచక్యంగా రక్షించి పైకి తీసుకొచ్చారు.అయితే ఆ వ్యక్తికి మతిస్థిమితం లేనట్లు తెలుస్తోంది.


# జలసౌధలో కేఆర్ఎంబీ భేటీ

హైదరాబాద్ : కృష్ణా యాజమాన్య బోర్డు ఎర్రమంజిల్‌లోని జలసౌధలో గురువారం సమావేశమైంది. సమావేశానికి తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీలు హాజరయ్యారు. వరద జలాల లెక్కింపుపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో విద్యుత్ ఉత్పత్తి కోసం విధివిధానాలు, రూల్ కర్వ్‌పై సైతం కేఆర్ఎంబీ చర్చించనున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో జలాశయాల నిర్వహణ కమిటీ సమావేశంలో రూల్ కర్వ్ విషయమై చర్చించి, రెండు రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకున్నారు. వాటికి అనుగుణంగా మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఇవాళ భేటీ జరుగుతున్నది.




# తదుపరి సీజేఐగా యుయు లలిత్ పేరును ప్రతిపాదించిన ఎన్వీ రమణ

న్యూఢిల్లీ: తదుపరి చీఫ్ జస్టిస్‌గా యుయు లలిత్ పేరును చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్వీ రమణ ఇవాళ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రికమండేషన్ లెటర్‌ను కూడా జస్టిస్ లలిత్‌కు సీజేఐ రమణ అందజేశారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు నుంచి బుధవారం రాత్రి సీజేఐ సెక్రటేరియేట్‌కు ఫోన్ కాల్ వెళ్లింది. తదుపరి సీజేఐ పేరును ప్రతిపాదించాలని మంత్రి రిజుజు ఎన్వీ రమణను కోరారు. చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ పదవీకాలం ఆగస్టు 26వ తేదీన ముగియనున్నది. ఆ తర్వాత జస్టిస్ లలిత్ బాధ్యతలు స్వీకరిస్తారు. అయితే చాలా తక్కువ కాలమే జస్టిస్ లలిత్ ఆ పదవిలో ఉండనున్నారు. ఆయన నవంబర్ 8వ తేదీన రిటైర్ అవుతారు. జస్టిస్ లలిత్ తర్వాత జస్టిస్ డీవై చంద్రచూడ్ సీజే అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే చంద్రచూడ్ మాత్రం రెండేళ్లు సీజేఐగా చేసే ఛాన్సు ఉంది.




# ఈడీ దాడులకు భయపడం : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ భవనంలోని యంగ్ ఇండియా లిమిటెడ్ కార్యాలయాన్ని ఈడీ సీల్ చేసిన అనంతరం మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దర్యాప్తు బీజేపీ అణిచివేత ఎత్తుగడల్లో భాగమని, కాషాయ పార్టీకి తాము భయపడబోమని రాహుల్ స్పష్టం చేశారు. బీజేపీ ఏం చేసినా తాము బెదిరేది లేదని అన్నారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు తన పోరాటం కొనసాగుతుందని గురువారం పేర్కొన్నారు. తమపై ఒత్తిడి తీసుకువస్తే మౌనం దాల్చుతామని కాషాయ పాలకులు అనుకుంటున్నారని, తాము మౌనం దాల్చబోమని బీజేపీ దుర్నీతిని ఎండగడుతూనే ఉంటామని అన్నారు.మనీలాండరింగ్ కేసులో భాగంగా కాంగ్రెస్‌కు చెందిన నేషనల్ హెరాల్డ్ భవనంలోని యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఈడీ బుధవారం సీల్ వేసిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా నేషనల్ హెరాల్డ్‌పై ఈడీ దాడులను కాంగ్రెస్ తప్పుపట్టింది. వాస్తవ అంశాలను మరుగునపరిచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని కాంగ్రెస్ నేత అభిషేక్ మనుసింఘ్వి దుయ్యబట్టారు. నేషనల్ హెరాల్డ్ కార్యాలయంలో ఈడీ దాడుల నేపథ్యంలో పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద భద్రతా దళాలను పెద్ద ఎత్తున మోహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.మోదీ సర్కార్ అన్నింటినీ సీల్ వేసే ధోరణితో వ్యవహరిస్తోందని అన్నారు. ఇలాంటి చవకబారు ఎత్తుగడలతో కేంద్రం తమ గొంతులను నొక్కలేదని సింఘ్వి పేర్కొన్నారు. విపక్షంగా తమ బాధ్యత నుంచి తాము ఎప్పుడూ పక్కకు తప్పుకోబోమని స్పష్టం చేశారు. మీరు ఎంతగా తమను అణిచివేయాలని చూసినా మీ తప్పిదాలను బయటపెడుతూనే ఉంటామని అన్నారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీ కక్షపూరిత రాజకీయాలను ప్రేరేపిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలకు పాల్పడటం ప్రజాస్వామ్య విధానం కాదని, తాము ఎక్కడికి పారిపోవడం లేదని వారు గుర్తుపెట్టుకోవాలని అన్నారు.

# అచ్యుతాపురం గ్యాస్ లీకేజీ బాధితులకు పరిహారం చెల్లించాలి : పవన్‌కల్యాణ్

అమరావతి : అచ్యుతాపురం గ్యాస్ లీకేజీ ఘటనలో బాధితులకు పరిహారం చెల్లించాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన



ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కర్మాగారాల్లో భద్రత లోపాలు తరుచూ బయటపడుతుండటం ఆందోళనకర పరిణామమని ఆయన అన్నారు. దేశ ప్రగతికి పరిశ్రమల ఆవశ్యకత ఎంతో అవసరమని అయితే ప్రజల ఆరోగ్యం, ప్రాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యతనూ విస్మరించరాదని పేర్కొన్నారు.అచ్యుతాపురం సెజ్‌లో సీడ్స్ కంపెనీలో నెలరోజుల్లో రెండుసార్లు విషవాయువుల లీకేజీ ఘటనలు ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. దువ్వాడ, అచ్యుతాపురం, పరవాడ తదితర పారిశ్రామిక ప్రాంతాల చుట్టుపక్కల కాలనీవాసులు ప్రమాదాల మధ్య కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ చేపట్టాలని సూచించారు. గ్యాస్ లీకేజీలో అస్వస్థతకు గురైె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారినికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# సంపాదకీయం

శుక్రవారం 05-08-2022

## తుపాకి కల్చర్ నియంత్రించే చర్యలు,,

ఇంకా నాగరిక విలువలూ, ప్రజాస్వామిక విలువలూ పూర్తిగా వికసించని మూడు శతాబ్దాలనాడు అంటిన తుపాకి సంస్కృతి చీడను అమెరికా సమాజం ఇప్పటికీ వదుల్చుకోలేకపోతున్నదని గురువారం అక్కడ జరిగిన రెండు భిన్న పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఈమధ్యకాలంలో వరసగా టెక్సాస్, న్యూయార్క్, కాలిఫోర్నియా తదితర ప్రాంతాల్లో ఉన్మాదుల తుపాకి గుళ్లకు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయాక అమెరికన్ కాంగ్రెస్ ఈ సంస్కృతిని నియంత్రించడానికి నడుం బిగించింది.తుపాకి పరిశ్రమల లాబీకి అండదండలందించే రిపబ్లికన్ పార్టీకి చెందిన సెనెటర్లను సైతం ఈ ఉదంతాలు పునరాలోచింపజే సిన పర్యవసానంగా గురువారం రాత్రి సెనేట్ 65?33 వోట్ల తేడాతో తుపాకుల లభ్యతను కఠినం చేసే బిల్లును ఆమోదించింది. అదే రోజు మధ్యాహ్నం తుపాకి నియంత్రణకు న్యూయర్క్ రాష్ట్రం 109 ఏళ్లక్రితం తీసుకొచ్చిన చట్టం చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. బహిరంగ ప్రదేశాల్లో మారణాయుధాలు ధరించి తిరగడం అమెరికన్ పౌరుల హక్కని తేల్చిచెప్పింది.ఈ తీర్పు ఇంగిత జ్ఞానానికీ, రాజ్యాంగ విలువలకూ గొడ్డలిపెట్టని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సరిగానే వ్యాఖ్యానించారు. ఈమధ్య బఫెలోలో జరిగిన హత్యాకాండకు పదిమంది పౌరులు బలయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా తుపాకుల బెడదను మరింత పెంచగల ఈ తీర్పునివ్వడానికి న్యాయమూర్తులు వెనకాడలేదు. వాస్తవానికి న్యూయార్క్ తుపాకి నియంత్రణ చట్టం అంత కఠినమైనదేమీ కాదు. మారణాయుధాలు దగ్గర ఉంచుకుంటామనేవారు అందుకు గల కారణాలు వివరించాలి.అవి సంతృప్తికరమైతే లైసెన్సు మంజూరు చేస్తారు. కానీ ఇలా షరతు విధించడం పౌరుల హక్కులను హరించడమే అంటున్నది సుప్రీంకోర్టు. గడపదాటి బయటి కెళ్లే ప్రతి ఒక్కరివద్దా ఆత్మరక్షణ కోసం మారణాయుధం ఉండాల్సిందేనని చెబుతున్నది. అందుకు రెండో రాజ్యాంగ సవరణను చూపుతున్నా దాన్ని న్యాయమూర్తులు సక్రమంగా అవగాహన చేసుకోలేదన్నది న్యాయ కోవిదుల వాదన. వరదలూ, తుపానులూ, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల ముందు ఎటూ మనిషి నిస్స హాయంగా తలవంచక తప్పడంలేదు. అమెరికాలో తుపాకి సంస్కృతి కూడా ఈమాదిరి వైపరీత్యం గానే పరిణమించింది. మొత్తం 19 రాష్ట్రాలు, వాషింగ్టన్‌లలో ఏదోమేరకు తుపాకి నియంత్రణ చట్టాలున్నాయి. కానీ అవి పెద్దగా అక్కరకు వచ్చిన దాఖలాలు లేవు. అయినా కూడా రాలిపడు తున్న అమాయక ప్రాణాలకు కాదు... ఉన్మాదుల హక్కుకే విలువ అధికమన్నట్టు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.సుప్రీంకోర్టు తాజా తీర్పుతో న్యూయార్క్‌లోనూ, అదే మాదిరి చట్టాలు అమల్లో ఉన్న కాలిఫోర్నియా, హవాయి, మసాచూసెట్స్, న్యూజెర్సీ తదితర రాష్ట్రాల్లోనూ మారణా యుధాలు విచ్చలవిడిగా పెరిగే ప్రమాదం ఉంటుంది. తాజాగా అమెరికన్ సెనేట్ ఆమోదించిన బిల్లు కూడా ఏమంత సమర్థవంతమైనది కాదు. అది డెమొక్రాట్లు ఆశించిన స్థాయి బిల్లు కాదురిపబ్లికన్‌లలో కొందరి ఆమోదమైనా పొందడం కోసం డెమొక్రాట్లు రాజీ పడి చేసిన మార్పుల పర్యవసానంగా రూపొందిన బిల్లు. మరో వారం పదిరోజుల్లో డెమొక్రాట్ల ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రతినిధుల సభలో ఈ బిల్లు ఆమోదం పొందితే చట్టమవుతుంది. అయితే సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రభావం ఆ చట్టంపై ఏమేరకుంటుందో చూడాల్సి ఉంది. ప్రమాదకరమైన వ్యక్తుల చేతుల్లోకి మారణాయుధాలు పోకుండా ప్రయత్నించే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలివ్వాలని సెనేట్ ఆమోదించిన బిల్లు ప్రతిపాదిస్తోంది. విద్యాసంస్థల భద్రతకూ, మానసిక వ్యాధులను అరికట్టడానికీ రాష్ట్రాలకు వందలకోట్ల డాలర్ల అదనపు నిధులివ్వడానికి వీలుకల్పిస్తోంది. అలాగే 21 ఏళ్లలోపువారికి మారణాయుధాల లభ్యత కఠినతరం చేస్తోంది. అలాంటివారి గత చరిత్రనూ, వారి మానసిక ఆరోగ్యాన్నీ మారణాయుధాల విక్రేత పోలీసుల సాయంతో తెలుసుకోవాల్సి ఉంటుంది.మూడురోజులపాటు జరిగే ఈ ప్రక్రియలో అనుమానాస్పద అంశాలు కనిపిస్తే రెండో దశ తనిఖీ ఉంటుంది. అది పదిరోజులపాటు సాగుతుంది. అసలు మారణాయుధాల కొనుగోలుకు ఇప్పుడున్న కనిష్ఠ వయసు అర్హతను 18 నుంచి 21కి మార్చాలన్న డెమొక్రాట్ల ప్రతిపాదనకు రిపబ్లికన్‌లు అంగీకరించలేదు. సాధారణ పౌరులకు తుపాకులు దక్క నీయకుండా ఏం చేయాలన్న ఆలోచనకు బదులు వాటి పేరుతో విద్యాసంస్థలకూ, ఆసుపత్రులకూ కోట్లాది డాలర్లు దక్కేలా చేయడం వల్ల ఒరిగేదేమిటో అంతుబట్టదు. ప్రజాస్వామ్య దేశంగా కనబడే అమెరికాలో తుపాకుల తయారీ యాజమాన్యాల నేతృత్వంలోని నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్(ఎన్ఆర్ఏ) సమాజాన్ని శాసిస్తున్నది. తుపాకి కలిగి ఉండటం ఒక హోదాకు చిహ్నమనీ, అది లేకపోతే ఆత్మరక్షణ అసాధ్యమనీ పౌరులకు భ్రమలు కల్పించడంలో అది ఎన్నడో విజయం సాధించింది. రెండు ప్రధాన పార్టీల్లోనూ ఎన్ఆర్ఏ లాబీలు పనిచేస్తుంటాయి.కాకపోతే రిపబ్లికన్‌లతో పోలిస్తే డెమొక్రాట్లు కాస్త నయం. 2020లో తుపాకులకు 45,222 మంది మరణించారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో మూకుమ్మడి హత్యా కాండలు మొదలుకొని ఆత్మహత్యల వరకూ అన్నీ ఉన్నాయి. తుపాకి నీడన బతుకీడ్చే దుస్థితినుంచి సాధ్యమైనంత త్వరగా అమెరికా బయటపడాలని, బైడెన్ ప్రభుత్వం తీసుకొస్తున్న చట్టం ఆ దిశగా ఒక మంచి ప్రారంభమవుతుందని ఆశించాలి.

# అజ్ఞాతంలో టీడీపీ నేతలు

గుంటూరు, ఆగస్టు 4, వరుపుల రాజా. ప్రత్తిపాడు టీడీపీ ఇంఛార్జ్. 2019లో టీడీపీ తరుపున పోటీ చేసి ఓడిపోయారు. మధ్యలో ఒకసారి పార్టీ పై విమర్శలు చేసి దూరంగా ఉండి.. తిరిగి పసుపు కండువా కప్పుకొన్నారు. రాజా గతంలో లంపకలోవ పియేసీఎస్ ప్రెసిడెంట్ ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో డిసిసిబి చైర్మన్‌గా ఒక వెలుగు వెలిగారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో హస్తానికి హ్యాండ్ ఇచ్చి సైకిల్ ఎక్కేశారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా.. లంపకలోవ సొసైటీలో అక్రమాలు జరిగాయని గతంలో సిఐడి కేసు నమోదైంది. 15 కోట్ల మేర అవినీతి జరిగిందని సహకార శాఖ విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత కేసును పోలీసులు దర్యాప్తు చేసి సిఐడి కి బదిలీ చేశారు.ఆ సమయంలో వెంటనే అలెర్ట్ అయిన వరుపుల హైకోర్టు నుంచి అరెస్ట్ చేయకుండా ఆదేశాలు తెచ్చుకున్నారు. అయితే పది రోజుల క్రితం సిఐడి అధికారులు గండేపల్లి సొసైటీలో అక్రమాలు జరిగాయని కేసు నమోదు చేశారు. ఆయనకి నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేయడానికి సిద్ధం అయ్యారు. చనిపోయిన వ్యక్తులు బతికి ఉన్నట్టుగా సంతకాలు పోర్జరీ చేసి కోట్ల రూపాయల నొక్కేశారనేది ఆరోపణ. ఆ కేసులో సిఐడికి చిక్కకుండా కరెంట్ పోయినప్పుడు రాజా ఎస్కేప్ అయ్యారు. అది జరిగి పది రోజులు గడుస్తున్నా.. టీడీపీ నేత ఎక్కడున్నారో జాడ తెలియడం లేదట.ఈ మొత్తం వ్యవహారంపై ఆసక్తికర చర్చ జరుగుతుంది. గతంలో రాజా వల్ల లబ్ధి పొందిన కొందరు పోలీసులు ఆయనకు లీకులు ఇస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సిఐడి అధికారులు రాజా ఇంటికి వచ్చినప్పుడు స్థానిక పోలీసులు భారీగా మోహరించారు. అదే సమయంలో కరెంట్ పోవడంతో రాజా తప్పించుకోవడం.. అది ఆయన ఒక్కరి వల్ల సాధ్యం కాదని చెవులు కొరుక్కుంటున్నారట. బ్యాక్ బోన్ సపోర్ట్ వల్ల కథ సుఖాంతమైందనే టాక్ నడుస్తోంది. ఎవరో కావాల్సిన వాళ్లు ఉప్పు అందించారని అనుమానిస్తున్నారు.కొందరు ఉన్నతాధికారులు ఈ కేసుపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారట. రాజాను అరెస్ట్ ఛేస్తే తమ పరిస్థితి ఏంటి అని విచారణలో మొత్తం కూపీ లాగుతున్నారట. అసలు ఈ కేసు గురించి అధికారులకు ఎందుకు? వాళ్లెందుకు హైరానా పడుతున్నారు అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సిఐడి అధికారులు మాత్రం పది రోజులు గడిచినా సీరియస్‌గా లేరనే టాక్ నడుస్తోంది. గతంలో కూడా బెయిల్ వచ్చేంత వరకు ఇలాగే సాగదీశారని గుర్తు చేసుకుంటున్నారట. ఇప్పుడూ అదే జరుగుతుందేమోనని కొందరి సందేహం.వరపుల రాజా ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. ఆయనకు వచ్చిన ముందస్తు సమాచారంతోనే ఎప్పటిలాగే అవుటాఫ్ స్టేషన్‌కి వెళ్లిపోయారని చర్చ జరుగుతోంది. షరా మామూలుగా సిఐడి అధికారుల గాలింపు కొనసాగుతోంది. మరి.. దర్యాప్తులో మలుపులు ఉంటాయో లేక పాత సీనే రిపీట్ అవుతుందో చూడాలి.

# అప్పులు లెక్కలు

విజయవాడ, ఆగస్టు 4, ఏపీ రుణపరిమితి లక్ష్మణ రేఖను దాటేసింది. కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అడ్డగోలుగా అప్పులు చేసి వాటిని బడ్జెట్ లో చూపకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించింది. అందుకే కార్పొరేషన్లు స్పెషల్ పర్పస్ వెహికిల్, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా జగన్ సర్కార్ చేసిన అప్పులన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వ అప్పులుగానే కేంద్రం పరిగణించింది. ఈ విషయాన్ని గత మార్చిలోనే రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం స్పష్టం చేసింది. ఈ విషయాన్ని రాజ్యసభ సాక్షిగా కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ కుండబద్దలు కొట్టినట్లు వెల్లడించారు. తెలుగుదేశం సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ రాజ్యసభలో అడిగన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ ఈ మేరకు బదులిచ్చారు. 2020 నుంచి 2022 వరకు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసేందుకు రూ. 65,489.36 కోట్లకు పైగా గ్యారెంటీలు ఇచ్చిందన్నారు. ఇందులో 2020-21లో రూ.46,719.42 కోట్లు, 21-22లో రూ.18,770.54 కోట్లకు గ్యారెంటీలు ఇచ్చినట్లు చెప్పారు.ఈ సమాచారాన్ని రాష్ట్రప్రభుత్వమే ఈ ఏడాది ఏప్రిల్ 27న కేంద్రానికి ఓ లేఖ ద్వారా తెలియజేసిందని నిర్మలా సీతారామన్ వివరించారు. అలాగే 2020-21లో వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రూ.22,549.5 కోట్లు, 21-22లో రూ.6.287.7 కోట్లు అప్పులు తెచ్చిందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 293(3) అధికరణ ప్రకారం 22-23లో కూడా అప్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని వెల్లడించారు.ఇక వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిఅడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్ బదులిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎస్డీసీ) సహా పలు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సాధారణ నికర రుణ పరిమితిని ఉల్లంఘించి రుణాలు చేసినట్లు చెప్పారు. వాణిజ్యపరమైన లాభ నష్టాలను, రుణాలను చెల్లించగల ఆదాయ సామర్థ్యాన్ని, నిధులు ఎక్కడకు మళ్లిస్తున్నారో గమనించకుండా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు బ్యాంకులు రుణాలివ్వడాన్ని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) కూడా తప్పు పట్టిన విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు రుణాలు, అడ్వాన్సులు మంజూరు చేసేటప్పుడు ఆర్‌బీఐ ఆదేశాలను పాటించాలని బ్యాంకులను నిర్దేశించినట్లు తెలిపారు. కేంద్రం రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందన్న విషయం ఆయనకు ఇప్పుడు తెలిసింది. అంతే రాజ్యసభ సాక్షిగా కేంద్రంపై విమర్శల వర్షం కురిపించేశారు. కేంద్రం రాష్ట్రాలను దోపిడీ చేస్తోందని దుయ్యబట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు ఇంతలా పెంచేస్తే పేద, మధ్య తరగతి ప్రజలు ఎలా బతుకుతారని నిలదీశారు.ద్రవ్యోల్బణం అరికట్టడంలో కేంద్రం దారుణంగా విఫలమైందని విమర్శలు గుప్పించారు. ఇంత చేసినా ఆయన రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన వాటిని వేటినీ ప్రస్తావించలేదు. విశాఖ రైల్వే జోన్ కానీ, పోలవరం బకాయిల గురించి కానీ, విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్ ఆపాలని కానీ, ఆఖరికి కడప ఉక్కు కర్మాగారం గురించి కానీ ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించలేదు. జనరల్ గా కేంద్రం

రాష్ట్రాలను అన్యాయం చేస్తోందని ఓ ప్రసంగం దంచేశారు. అందులో కేంద్రం రాష్ట్రాలను దోచేస్తోందని విమర్శలు గుప్పించారు.ఇంత కాలంగా కేంద్రం తిట్టినట్టు చేస్తే వైసీపీ సర్కార్ కనీసం ఏడ్చినట్లు కూడా చేయలేదు. ఇప్పుడు సీన్ రివర్స్ అయినట్లు కనిపిస్తోంది. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి కేంద్రంపై విమర్శలు గుప్పించినట్లు చేశారు. కేంద్రం పట్టించుకోనట్లు చేస్తుంది అంతే అని పరిశీలకులు అంటున్నారు. సెస్, సర్ చార్జీల్లో రాష్ట్రానికి ఇవ్వడం లేదనీ, పన్నుల వాటాలో రాష్ట్రాలకు 41శాతం వాటా ఇవ్వడం లేదనీ అన్నారు. ఏడేళ్లలో ఏపీ 46వేల కోట్ల రూపాయలు నష్టపోయిందన్నారు వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి. రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడి ఆర్థిక సంక్షోభం అంచున నిలిచిన నేపథ్యంలో తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకునే ప్రయత్నమే విజయసాయి రాజ్యసభలో కేంద్రంపై విమర్శలతో విరుచుకుపడం అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. చెత్తపై పన్ను కేంద్రం వేసిందా అని పరిశీలకులు నిలదీస్తున్నారు. అడ్డూ అదుపూ లేకుండా చేసిన అప్పుల కారణంగా ఇకపై అప్పులు పట్టిని దుస్థితిలో ప్రజల దృష్టి మరల్చి గట్టెక్కాలన్న ఉద్దేశంతోనే విజయసాయి కేంద్రంపై విమర్శలు గుప్పించారని అంటున్నారు.

# తిరుపతిలో భారీగా ఉసిరి...సాగుబడి

తిరుపతి, ఆగస్టు 4, సంప్రదాయ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఉసిరి పంట ఊరటనిస్తోంది. ఒకసారి సాగు చేస్తే 40 ఏళ్ల వరకు దిగుబడినిస్తోంది. ఏడాదికి రెండు సార్లు ఫలసాయం అందిస్తోంది. తెగుళ్ల బెడద నుంచి కాపాడుతోంది. పెట్టుబడి ఖర్చును తగ్గిస్తోంది. మరోవైపు ఈ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. ఇది ఆయుర్వేద ఔషధంగానూ ఉపయోగపడుతోంది. అధిక దిగుబడితోపాటు రైతులకు లాభాల పంట పండిస్తోంది.పండించే పంట దిగుబడి లేదని, దిగుబడి బాగా వచ్చినా మార్కెట్‌లో మంచి ధర పలకలేదని, నేల సారవంతంగా లేదని.. ఇలా రకరకాల కారణాలు రైతులను కుంగదీస్తున్నాయి. అయితే వ్యవసాయంలో ఆశించిన లాభాలు చూడలేమని నీరసించిన రైతులకు ఉసిరి పంట ఊరటనిస్తోంది. ఏడాదికి రెండు సార్లు ఫలసాయాన్ని అందిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను కురిపిస్తూ రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ పంట సాగుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.18 వేలు సబ్సిడీ అందిస్తోంది.ఆయుర్వేద వైద్యంలో ఉసిరే కీలకం. అందుకే ప్రతి వ్యక్తీ తన జీవిత కాలంలో ఐదు ఉసిరి మొక్కలైనా నాటాలని పూర్వీకులు చెబుతారు. మనకు రోగనిరోధకశక్తి పెరగాలంటే సి?విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు తినాలి. కరోనా పుణ్యమా అని దీనిపై అందరికీ అవగాహన పెరిగింది. అయితే సి విటమిన్ ఎక్కువగా ఉండే వాటిలో ప్రథమ స్థానం ఉసిరికే దక్కుతుంది. ఆరోగ్యాన్ని అందించే ఉసిరి రైతులు లాభాలను కూడా మెండుగా అందిస్తోంది.విజయపురం మిట్టూరు, శ్రీహరిపురం, కాకవేడు ప్రాంతాల్లోని రైతులు ఉసిరి పంటను సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ఉసిరి సాగవుతోంది. తమిళనాడు తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకునే రైతులు ఈ ప్రాంతాల్లో సాగుచేస్తున్నారు. ఒక్క సారి సాగు చేసి మొక్కలు నాటితే రెండేళ్లకు కాత వచ్చి ఏడాదికి రెండు సార్లు ఫల సాయం అందుతోంది. ఎకరాకు 200 చెట్లు నాటి సాగుచేసిన రైతులు చెట్టు పెరుగుదలను అనుసరించి ఎకరాకు రెండు నుంచి 5 టన్నుల వరకు దిగుబడిని పొందుతున్నారు. ఒక్క సారి మొక్కలు నాటితే 30 నుంచి 40ఏళ్ల వరకు ఫలసాయం అందుతుందని ఉద్యానవన అధికారులు తెలుపుతున్నారు.ఉసిరి చెట్టు నీటి కొరతను చాలా వరకు తట్టుకుంటుంది. చీడపీడలు, తెగులు ఎక్కువగా ఆశించదు. ఈ కారణంగా సాగు ఖర్చు తగ్గుతుంది. రాబడిలో ఖర్చు 10 శాతం మాత్రమే ఉంటుంది. డిమాండ్‌ను బట్టి టన్నుకు రూ.30 వేలు నుంచి 50 వేలు వరకు ధర పలుకుతుంది. నగరి, విజయపురం మండలాల్లో సాగుచేసే ఉసిరి మన రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, తెనాలితో పాటు తమిళనాడు, తెలంగాణలని ఫ్యాక్టరీలకు రవాణా అవుతోంది. ఈ ప్రాంతాల నుంచి ఫ్యాక్టరీలకు తరలి వెళ్లే ఉసిరితో మందులు, సిరప్‌లు, ఆయిల్, సోపు, ఊరగాయలు తయారుచేసి మార్కెట్లో విక్రయిస్తారు.

# ఎన్నికలపై ఫుల్లు ఫోకస్

విజయవాడ, ఆగస్టు 4,జగన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల కు ముందు నుంచే పార్టీ పై ఫుల్లుగా ఫోకస్ పెట్టారు. వరసగా ఎమ్మెల్యేలతో సమావేశాలు. ఆ తర్వాత ముఖ్య కార్యకర్తలతోనూ సమావేశం కాబోతున్నారు. అయితే మూడేళ్లుగా పార్టీని పట్టించుకోని జగన్ ఈ రెండేళ్లు పాలనతో పాటు పార్టీకి కూడా కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అంతేకాదు నియోజకవర్గాల్లో నెలకొన్న విభేదాలను పరిష్కరించుకుని పార్టీని మరింత ముందుకు తీసుకుపోయే వ్యూహరచనలో ఉన్నారు. తాను సంక్షేమ పథకాలను అమలు చేసి బలమైన ఓటు బ్యాంకును ఏర్పాటు చేసుకున్నారు. కానీ నియోజకవర్గాల్లో నాయకత్వం సరిగా లేకపోతే ఓటు బ్యాంకు కీలకమైన ఎన్నికల సమయంలో చెల్లాచెదురై పోయే ప్రమాదముంది. అందుకే క్యాడర్ తోనూ సమావేశమవుతున్నారు. ఇలా పార్టీని బలోపేతం చేయడంతో పాటు టీడీపీని బలహీనం చేసే ప్రయత్నాలకు జగన్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కేసులతో అనేక మందిని మానసికంగా ఇబ్బందులకు గురి చేశారన్న ఆరోపణలు వినిపించినా ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. తాను అనుకున్నట్లు నియోజవకర్గాల్లో పరిస్థితులను బట్టి అక్కడి నేతల ఇష్ట ప్రకారం నిర్ణయాలు తీసుకున్నారు.

# ఎట్టకేలకు బుట్టాకు పదవి



కర్నూలు, ఆగస్టు 4,ఏపీ రాజకీయాల్లో ఎప్పుడు, ఎవరికి, ఎలాంటి పదవులు లభిస్తాయో తెలీదు. అందునా ఇతర పార్టీల్లోకి వెళ్ళి మళ్ళీ పార్టీలోకి వచ్చినవారి విషయంలో వెయిట్ అండ్ సీ ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. తాజాగా మాజీ ఎంపీ బుట్టా రేణు విషయంలో అదే జరిగింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మాజీ ఎమ్పీ బుట్టా రేణుకకు పార్టీ పదవి వరించింది. కర్నూలు జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించింది వైసీపీ. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది పార్టీ.బుట్టారేణుక గత కొంతకాలంగా స్తబ్ధంగా వున్నారు. ఆమె రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేస్తారని ప్రచారం సాగింది. అయితే ఆమె దీనిపై తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే కంటే ఎంపీగా కొనసాగడమే తనకు అమితంగా ఇష్టమని.. ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తాననడం ఊహాగానాలేనన్నారు. తనకు ఈ విషయంపై అధిష్టానం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని.. అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా గాని.. ఎంపీగా గాని పోటీ చేసి గెలిచి ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు రేణుక.ఎమ్మిగనూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి వున్నారు. ఆయన రాబోయే ఎన్నికల్లో పోటీచేయకపోవచ్చని, తన వారసుడిగా తన కొడుకు జగన్ మోహన్ రెడ్డిని నిలబడతారనే ప్రచారం సాగింది. అక్కడ బుట్టా రేణుక పోటీచేసే అవకాశమే లేదని ఆమె సన్నిహితులు అంటున్నారు. ఆమె ఎమ్మెల్యేగా కంటే ఎంపీగా పోటీచేయడం బెటర్ అంటున్నారు.బుట్టా రేణుక వైసీపీ తరపున గెలిచి, తర్వాత 2014 ఎన్నికల తర్వాత టీడీపీలో చేరడంపై విమర్శలు వచ్చాయి. పారిశ్రామిక వేత్తగా వున్న బుట్టా రేణుక 2014 ఎన్నికల్లో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు.. వైఎస్సార్‌సీపీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి కర్నూలు పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయిన సంగతి తెలిసిందే. అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీని వీడి అప్పుడు అధికారంలో ఉన్న తెలుగు దేశం పార్టీలో చేరారు.2019 ఎన్నికలకు ముందు టీడీపీ తనను మోసం చేసిందంటూ మళ్లీ జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.. పార్టీని వీడినందుకు జగన్‌కు ఆమెకు క్షమాపణలు కూడా చెప్పడం విశేషం. అలాగే గత ఎన్నికల్లో ఎలాంటి పదవి లేకపోయినా జిల్లాలో వైసీపీ అభ్యర్థుల్ని గెలిపించేందుకు ఆమె ప్రయత్నించారు. ఆమె పై వున్న అపప్రథ పోవడంతో పార్టీ అధిష్టానం ఆమెకు పదవి కట్టబెట్టింది. మరి 2024 ఎన్నికల్లో బుట్టా రేణుక ఎక్కడినించి పోటీచేస్తారో వేచి చూడాల్సిందే.

## పెరుగుతున్న అమ్మాయిల మిస్సింగ్

అనంతపురం, ఆగస్టు 4,విద్యార్థి దశలోనే కొందరు అమ్మాయిలు పెడదోవ పడుతున్నారు. తల్లిదండ్రుల గారాబంతో పాటు పర్యవేక్షణ కొరవడటంతో క్రమశిక్షణ తప్పుతున్నారు. కొందరు స్మార్ట్‌ఫోన్లలో గేమ్స్‌కు బానిసైతే.. మరికొందరు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో మునిగి తేలుతున్నారు. ఈ నేపథ్యంలోనే చదువును పక్కనపెట్టి ప్రేమలో పడుతున్నారు. తల్లిదండ్రులకు తెలిసినా.. మందలించినా ... తమ స్వేచ్ఛను వారు ఏదో హరిస్తున్నారనుకుని అనాలోచిత నిర్ణయాలతో తప్పటడుగులు వేస్తున్నారు. చేజేతులా భవిష్యత్తు పాడు చేసుకుంటున్నారు.జిల్లాలోని కళ్యాణదుర్గం, అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో 2020 నుంచి 2022 జూలై 15వ తేదీ వరకు 2,037 అదృశ్యం కేసులు నమోదయ్యాయి. ఇందులో బాలికలు, మహిళలు 1,657 మంది ఉన్నారు. చదువు కోసం పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు, గ్రామాల్లో కూలీలు, పరిశ్రమల్లో పనులకెళ్లే మహిళలు ప్రేమ పేరుతో వంచనకు గురవుతున్నారు. ఇళ్ల నుంచి వెళ్లిపోవడం.. రోజులు గడిచాక చేసిన తప్పు తెలుసుకుని బాధపడటం చేస్తున్నారు. చివరకు పోలీస్ కౌన్సెలింగ్‌తో మనసు మార్చుకుని ఇంటిబాట పడుతున్నారు. రాయదుర్గం పట్టణం చన్నవీరస్వామి ఆలయ సమీపంలో నివసిస్తున్న ఓ యువతి షాపింగ్‌కని ఈ ఏడాది ఏప్రిల్ 26న ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మే 4న గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ చేయగా.. గుడ్డిగా నమ్మి.. వెళ్లానని.. తన నిర్ణయం సరైంది కాదని తెలుసుకున్నానని చెప్పడంతో తల్లిదండ్రుల వెంట ఇంటికి పంపించేశారు. రాయదుర్గం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఏప్రిల్ 25న నీళ్లు తేవటానికని బిందె తీసుకుని ఇంటి నుంచి వచ్చింది. కొళాయి వద్ద బిందె ఉంచి.. ప్రేమికుడితో ఉడాయించింది. కుటుంబ సభ్యులు మూడు రోజులు వెతికినా ఎక్కడా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ ఆధారంగా అదే నెల 30న ఎట్టకేలకు ఆ జంటను పోలీసులు అదుపులోకి తీసుకుని.. తల్లిదండ్రులకు అప్పగించారు.

పోలీసు కౌన్సిలింగ్ తీరు...

ఇంట్లో నుంచి తీసుకెళ్లిన సొమ్ము అయిపోయిన తర్వాత పరిస్థితి ఆలోచించాలి.

అసాంఘిక శక్తుల చేతికి చిక్కితే పరిస్థితి ఏంటి?

ఇష్టాయిష్టాలను తల్లిదండ్రులకు తెలియజేస్తే మంచిది.

ఇష్టం లేని వివాహాలు, చదువులు, ఆశించిన ర్యాంకు రాదనే కారణాలు సహేతుకం కాదు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన వారిని బంధువులు, సమాజం చులకనగా చూస్తుంది.

మొదట్లో బాగున్నా తర్వాత సంసారాల్లో కలహాలు మొదలవుతాయి.

ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచిది.

టీనేజీ అమ్మాయిల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలి. వారు చేసే పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దేలా చూడాలి.

# అండర్ సీ టూరిజం...

విశాఖపట్టణం, ఆగస్టు 4, విశాఖ తీరం పర్యాటకులకు వినూత్న అనుభూతులను అందిస్తోంది. సాగరగర్భంలోని అనంత సంపద అందాల మధ్య ఈత కొట్టిస్తోంది. సాహసాలు చేసే యువతకు స్కూబా డైవింగ్ (సముద్ర లోతుల్లో ఈత)లో దేశంలోనే అగ్రశ్రేణి ప్రాంతంగా నిలుస్తోంది. ఇప్పటికే రుషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్‌తో అంతర్జాతీయ పర్యాటకాన్ని ఆకర్షిస్తున్న తరుణంలో.. ప్రభుత్వం విశాఖ కేంద్రంగానే స్కూబా డైవింగ్ అకాడమీ ఏర్పాటుకు కూడా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. విశాఖ సముద్ర జలాల లోతుల్లో ఈదుతూ స్పష్టంగా చూడగలిగే ప్రాంతాలు చాలా ఉన్నాయి. ఇవే పర్యాటకులను స్కూబా డైవింగ్ వైపు ఆకర్షిస్తున్నాయి. పూడిమడక బీచ్‌లో 3 స్పాట్స్, రుషికొండలో 2, మంగమారిపేటలో 3, భీమిలిలో సైతం సాగర అడుగు భాగంలోని అరుదైన మత్స్య, వృక్ష, జంతు సంపదతో డైవింగ్‌కు అనుకూలంగా ఉండే ప్రాంతాలను స్థానిక స్కూబా డైవర్లే కనుగొనడం విశేషం. ప్రభుత్వం విజయనగరం జిల్లా తీర ప్రాంత గ్రామమైన చింతపల్లిలో స్కూబా డైవింగ్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. ఇక్కడి సముద్ర జలాలు మాల్‌దీవులు, అండమాన్ పరిస్థితులను పోలి ఉండటంతో పాటు అడుగున ఓడ శిథిలాలు, చిన్నచిన్న పర్వతాలు, జంతుజాలం ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాలు చాలా అరుదుగా ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒడ్డు నుంచి 10 కిలో మీటర్ల లోపలికి వెళ్లితే 5 స్పాట్‌ల్లో సముద్రగర్భ అందాలను చూడవచ్చు. పర్యాటకులతో సరదాగా స్కూబా డైవింగ్ చేయించడంతో పాటు అకాడమీ ద్వారా సర్టిఫికేషన్ కోర్సులు అందించనున్నారు. తద్వారా ప్రపంచ సముద్ర జలాల్లో స్కూబా డైవింగ్ చేసేందుకు అర్హత లభిస్తుంది. ఇందులో ఓపెన్ వాటర్, అడ్వాన్స్ ఓపెన్ వాటర్ విభాగాల్లో చేయాల్సి ఉంటుంది. వీరికి శిక్షణలో భాగంగా తొలుత స్విమ్మింగ్ పూల్ (నిశ్చల జలాల్లో) మెలకువలు నేర్పిస్తారు. సముద్రం అడుగు భాగంలోని వాతావరణ పరిస్థితులను బోధిస్తారు. రెండు రోజుల నుంచి వారం పాటు సాగే ఈ కోర్సుల్లో చేరేవారికి కచ్చితంగా ఈత వచ్చి ఉండాలి. ఒక్కో కోర్సుకు సుమారు రూ. 25 వేల వరకు ఫీజు ఉంటుంది. దేశంలో గోవా, నేత్రాని ద్వీపం (గోవా సమీపంలోని కర్ణాటక తీరంలో), పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ దీవుల్లో మాత్రమే డైవింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. స్కూబా డైవింగ్‌ను సాహస క్రీడగా పేర్కొంటూ అందులో విశేష ప్రతిభ కనబరిచిన వారికి కేంద్రం టెన్జింగ్ నార్గే అవార్డును సైతం అందిస్తోంది. దీనిని అర్జున అవార్డుతో సమానంగా గుర్తిస్తారు. విశాఖలో పర్యాటకులకు రెండు రకాల స్కూబా డైవింగ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి డైవింగ్ మాస్టర్ ప్రత్యేక సూచనలిస్తూ ఒడ్డు నుంచి ఈదుకుంటూ 500 మీటర్ల వరకు సముద్ర జలాల్లోకి తీసుకెళ్తారు. మరో విధానంలో బోటుపై 1.5కిలో మీటర్ల సముద్రం లోనికి తీసుకెళ్లి డైవింగ్ చేయిస్తారు. రెండింటిలోనూ 8?11 మీటర్ల లోతు వరకే పర్యాటకులను అనుమతిస్తారు. ఇందు కోసం రూ.2,500 నుంచి రూ.4వేలకు పైగా ఫీజు వసూలు చేస్తారు. పర్యాటకులు సాహసం చేసే సమయంలో వీడియోను చిత్రీకరించి అందిస్తారు. ఉదయం పూట సముద్రం ప్రశాంతంగా ఉంటుంది. అలల ఉధృతి తక్కువగా ఉండటంతో పాటు సాగర గర్భంలో పరిస్థితులు నెమ్మదిగా ఉంటాయి. అందుకే ఉదయం పూటనే స్కూబా డైవింగ్‌ను చేయిస్తున్నాం. సాయంత్రం అయితే సముద్రం పోటు ఎక్కువగా ఉండి.. డైవర్లకు విజిబులిటీ తక్కువ అవుతుంది. గతంతో పోలిస్తే పర్యాటకులు సంఖ్య పెరుగుతోంది. స్కూబా డైవింగ్‌కు వయసుతో సంబంధం లేకుండా ఆరోగ్యంగా ఉంటే ఎవరైనా చేయవచ్చు. మనకు చింతపల్లి అంతర్జాతీయ స్థాయి స్కూబా డైవింగ్ కేంద్రంగా మారే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వంతో కలిసి అక్కడ అక్టోబర్ నుంచి అకాడమీ సేవలను ప్రారంభించనున్నాం.

# నీటిలో మునిగిపోయిన కారును నెట్టిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు నెల్లూరు నగరంలో తెల్లవారుజాము భారీ వర్షం పడింది. ఈ వర్షానికి మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జి వద్ద మోకాళ్ళ లోతు నీరు నిలిచిపోయింది. గురువారం ఉదయం వివాహాలు ఎక్కువగా ఉండటంతో మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ ఏర్పడింది. మోకాళ్ళలోతు నీళ్లలో వాహనాలు చిక్కుకుపోయి ముందుకు కదలలేక ఆగిపోయాయి. అదే సమయంలో మాగుంట లేఔట్ బ్రిడ్జి మీదగా తన కార్యాలయానికి వెళ్ళేందుకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అక్కడకు చేరుకొని ప్రత్యక్షంగా పరిస్థితిని చూసి కారు దిగి నేరుగా మోకాళ్ళ లోతు నీళ్లలోనే నడుచుకుంటూ కారు వద్దకు వెళ్లారు. వర్షపు నీళ్ళల్లో ఆగిపోయిన కారును ఆయనే స్వయంగా తోయడం ప్రారంభించారు. అలాగే గన్ మెన్ రమేష్, డ్రైవర్ అంకయ్యతో పాటు చుట్టుపక్కల వారు సహాయం చేశారు. బ్రిడ్జి మధ్యలో నుంచి మాగుంట లేఔట్ ఎత్తు ఎక్కే వరకు కారును తోసారు. జోరు వర్షంలో కూడా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే తన వంతు బాధ్యతగా మోకాళ్ళలోతు నీళ్లలో ఓవైపు వర్షంలో తడుస్తూనే నెలలో చిక్కుకుపోయిన కారును తోయడం అక్కడున్న వారిని అందరి అభినందనలు అందుకుంది. అక్కడి నుంచి కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ అధికారులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి స్వయంగా మాట్లాడారు. నీటిని త్వరితగతిన తోడివేయాలని ట్రాఫిక్‌కు కానిస్టేబుల్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. సమాజంలో కొన్ని సంఘటనలు చూస్తూ మనకెందుకులే అనుకునే ఈ రోజుల్లో ఎమ్మెల్యే హోదాలో ఉండి కూడా మోకాల్లోతో నీళ్లల్లో ఆయన చేసిన సహాయం పదిమందికి ఆదర్శంగా నిలిచిపోయింది.

# కోమడవోలు లో విజిలెన్స్ దాడులు

ఏలూరుఏలూరు జిల్లా ఏలూరు రూరల్ మండలం కోమడవోలు గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాలతో పిడిఎస్ రైస్ గోడౌన్ పై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు పాయింట్ ఒకటి మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని వారు సీజ్ చేశారు ఈ బియ్యం యజమానిగా చెప్పబడుతున్న పవిత్ర కుమార్ పై కేసు నమోదు చేసారు. వీటి విలువ 91800గా వారు తెలిపారు దాడిలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ విల్సన్ రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# పార్టీలో సముచిత స్థానం కల్పించాలి



విజయనగరం విజయనగరం నియోజకవర్గంలో మాకు సముచిత స్థానం కల్పించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిల్లా విజయకుమార్, వైయస్సార్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు అవనాపు విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే మాపై కక్షగట్టి వ్యవహరిస్తున్న తీరును, ఆయన పార్టీకి చేస్తున్న నష్టాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ బొత్స సత్యనారాయణ ను విజయవాడలో కలిసి వినతి పత్రం అందజేయడంతో మంత్రి బొత్స సానుకూలంగా స్పందించారని విజయ్ కుమార్ చెప్పారు. అదేవిధంగా జిల్లా పరిషత్ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జ్ మజ్జి శ్రీనివాసరావును గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో కలిసి తమ సమస్యలను వివరించినట్లు వెల్లడించారు. అనంతరం పిల్లా,అవనాపు విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఆయన వెంట నడిచి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని స్పష్టం చేశారు. పార్టీలో తమకంటే వెనుక వచ్చిన వారికి అందలమెక్కించి మాపై చిన్నచూపు చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం నియోజకవర్గంలో వైయస్సార్ పార్టీ గెలుపులో తామంతా ఎంతో కృషి చేశామని, అయినప్పటికీ

**మంత్రి బొత్స కు మా సమస్యలు వివరించాం**
**సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు**
**పార్టీ జిల్లా ఇన్చార్జి కు వినతి**

మమ్మల్ని మంత్రి బొత్స వర్గమని చెప్పి స్థానిక ఎమ్మెల్యే పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంచడంతోపాటు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన మమ్మల్ని కార్పొరేషన్ ఎన్నికల్లో పక్కనపెట్టి స్థానిక ఎమ్మెల్యే తన కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు, తన వ్యాపారాల్లో భాగస్వాములుగా ఉన్నవారికి, తన చెప్పు చేతుల్లో ఉండే ఉండేవారికి కార్పొరేషన్ సీట్లను ఇచ్చారని, అయినప్పటికీ పార్టీ అధిష్టానం ఆదేశాలను శిరసావహించి కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం తామంతా కృషి చేయడం వల్ల 48 స్థానాలను గెలుచుకోగలిగామని స్పష్టం చేశారు. పార్టీ విజయాలకు తాము ఎంతో కృషి చేస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే వ్యవహార శైలి మాకు ఎంతో బాధ కలిగిస్తుందని అన్నారు. ఈ ఎమ్మెల్యే నియోజకవర్గంలో కార్పొరేటర్లు, సర్పంచులను బినామీలుగా చేసి వారిని ఒక దిష్టిబొమ్మల చూపించి, ఒక నియంత లా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో ఏ ఫైల్ కదలాలన్నా ముందుగా అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాలని ఆదేశించడంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో ఎమ్మెల్యే ఆదేశాలను శిరసావహిస్తూ మానసిక ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడ కారణంగా నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో భూదందాలు, అవినీతి, కబ్జాలు చేస్తూ పార్టీకి తీరని నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. పార్టీ జెండాతో గెలిచిన వారందరినీ పక్కనపెట్టి ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యతనిస్తున్నారని, వారు ఆడిందే ఆట పాడిందే పాటగా ఎమ్మెల్యే తీరు ఉందని విమర్శించారు. నియోజకవర్గంలో పార్టీకి జరుగుతున్న నష్టంపై పార్టీ ఇన్చార్జిలు దృష్టి పెట్టకపోతే పార్టీకి తీరని నష్టం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గాడు అప్పారావు, కోరాడ సూర్య ప్రభావతి, చందకు రమణ, దుక్క లక్ష్మి, పొట్నూర్ పద్మ, పార్టీ నాయకులు రౌతు చంటి, పొట్నూరు వెంకటరాజు, కంది అప్పారావు తదితరులు పాల్గొన్నారు


# విద్యార్ధి దారుణ హత్య

అనంతపురం అనంతపురం జిల్లా కంబదూరు మండల పరిధిలోని ములకనూరు గ్రామానికి చెందిన 9వ తరగతి చదివే విద్యార్థి దండా అఖిల్ మే 21న కంబదూరు పోలీ?సస్టేషనలో అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశారు. ఆ అదృశ్యమైన దండా అఖిల్ అతి దారుణంగా హత్య చేసినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది.ములకనూరు గ్రామానికి చెందిన శారదమ్మ, హనుమంతరాయుడు దంపతులకు ముగ్గురు పిల్లలు అఖిల్, వర్షిత, త్రిష ఉన్నారు. 8 నెలల క్రితం వర్షితను కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామానికి చెందిన అనిల్‌కిచ్చి వివాహం చేశారు. అనిల్ భార్య వర్షిత, మరదలు త్రిష, అత్త శారదమ్మను బాగా చూసుకుంటూ కుటుంబానికి పెద్దదిక్కుగా మారిపోయాడు. ఇంతలోనే అత్త శారదమ్మకు చెందిన 13 ఎకరాల భూమిపై అత్యాశ పెంచుకున్నాడు. ఆస్తికి అడ్డుగా ఉన్న బావమరిదిని చంపాలని కుట్ర వేశాడు. మే 21 ములకనూరు గ్రామంలో తిమ్మప్పస్వామి జాతర జరుగుతుండగా అఖిల్ అదృశ్యమయ్యాడు. వెంటనే కంబదూరు పోలీ?సస్టేషనలో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. దీంతో సొంత బావ అయిన అనిల్‌పై పోలీసులకు అనుమానం వచ్చింది. విషయం తెలుసుకున్న అనిల్ పరారయ్యాడు. దీంతో అతని ఆచూకీ కనుగొని అరెస్ట్ చేయగా అసలు విషయం బహిర్గతమైంది. సెల్‌ఫోన ఇప్పిస్తానని అనిల్.. అఖిల్‌ను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని గుద్దెళ్ల గ్రామంలోని తోటలోకి తీసుకెళ్లాడు. కాళ్లు, చేతులను డ్రిప్ వైర్లతో కట్టేసి, మెడపై మచ్చుకత్తుతో నరికి చంపి ముందుగానే తీసి ఉంచిన గుంతలో పూడ్చివేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. పోలీసులు అతడిని తీసుకుని ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఒక్కగానొక్క కుమారుడిని చంపిన అల్లుడిని కఠినంగా శిక్షించాలని అత్త శారదమ్మ కన్నీరుమున్నీరైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రైవర్ లేకుండా కదిలిన బస్సు

నెల్లూరు, ఆగస్టు 4 "ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం".. ఇది నిత్యం మనకు బస్సుల్లో (ంఖూఖీఅ) కనిపించే నినాదం. అయితే అలాంటి వాక్యాలు, మాటలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో అవి అమలు అవడం లేదు. ప్రయాణికులను భద్రంగా గమ్యస్థానానికి చేర్చాల్సిన ఆర్టీసీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా నిత్యం ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ఘటనల్లో ప్రయాణీకులు భారీ మూల్యాన్ని చెల్లించుకుంటున్నారు. కొందరు జీవచ్ఛవాల్లా మారితే.. మరికొందరు మాత్రం ప్రాణాలే కోల్పోతున్నారు. సరిగ్గా నెల్లూరు జిల్లాలో ఇలాంటి ఘటనే జరిగింది. నెల్లూరు జిల్లా కావలి పట్టణానికి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, కారు పరస్పరం ఢీ కొట్టుకున్నాయి. కండక్టర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఆ సమయంలో బస్సులో డ్రైవర్ లేకపోవడం గమనార్హం. ఓ కారు వేగంగా ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద కావలి (ఐజీలజీశ్రీతి) నుంచి నెల్లూరుకు వెల్తున్న బస్సును ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది.ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 24 మంది ప్రయాణికులు ఉన్నారు. కారు వేగంగా ఢీ కొట్టడంతో బస్సు డ్రైవర్ ప్రసాద్.. డ్రైవింగ్ సీట్ నుంచి ఎగిరి రోడ్డు పై పడ్డారు. డ్రైవర్ లేకుండానే బస్సు ముందుకెళ్లింది. ఈ హఠాత్పరిణామానికి బస్సులో ఉన్న ప్రయాణికులు షాక్ అయ్యారు. భయంతో కాపాడాలంటూ ఆర్తనాదాలు చేశారు. అప్పుడు బస్సులోనే ఉన్న కండక్టర్ నాగరాజు స్టీరింగ్ వద్దకు వెళ్లి బ్రేకులు వేయడంతో బస్సు ఆగింది. కాగా.. అప్పటికే బస్సు దాదాపు 150 మీటర్ల వరకు ముందుకెళ్లింది. కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా పది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

# నిండుకుండలా మూసి



హైదరాబాద్, ఆగస్టు 4, (న్యూస్ పల్స్)ఇటీవల కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలకు జంట జలాశయాల గేట్లను జలమండలి వరుసగా తెరుస్తోంది. మూసీలో వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. నగరంలో నది ప్రవహించే మార్గంలో బాపూఘాట్?ప్రతాపసింగారం (44 కి.మీ) మార్గంలో పేరుకుపోయిన ఘన వ్యర్థాలు, మురికి వదిలింది. దీంతో చాదర్‌ఘాట్, మూసారాంభాగ్ వంతెనలపై నుంచి వీక్షిస్తే.. నదిలో నీరు స్వచ్ఛంగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న సిటీజన్లు స్వచ్ఛ జల ప్రవాహం చూసి సెల్ఫీలు తీసుకుంటున్నారు. అంతేకాదు.. మూసీ నీటిలో మల, మూత్రాదుల్లో ఉండే హానికారక కోలిఫాం బ్యాక్టీరియా మోతాదు గణనీయంగా తగ్గినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తాజా నివేదిక సైతం స్పష్టం చేయడం గమనార్హం. కాలుష్య మోతాదును నిర్ధారించేందుకు పలు రకాల నాణ్యతా పరీక్షలు నిర్వహించగా.. బయోలాజికల్ ఆక్సీజన్ డిమాండ్ మూసీలో క్రమంగా తగ్గుముఖం పట్టినట్లు తేలింది. జూలై చివరి నాటికి జలాల్లో బీఓడీ మోతాదు లీటరు నీటిలో 21 మిల్లీ గ్రాములుగా నమోదైంది. అంతకుముందు సంవత్సరం ఇది 40 మిల్లీ గ్రాములుగా నమోదవడం గమనార్హం. కోలిఫాం బ్యాక్టీరియా మోతాదు సైతం సీపీసీబీ పరిమితి ప్రకారం.. మోస్ట్ ప్రాపబుల్ నంబరు పరిమిత స్థాయిలోనే ఉన్నట్లు తేలింది. తెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో జంట జలాశయాలు, పలు నాలాల నుంచి మూసీలోకి వరద నీరు చేరుతుండడంతోనే మురుగు క్రమంగా వదులుతోంది. దీంతో వ్యర్థజలాలు తొలగి నాణ్యత మెరుగుపడింది. ఇటీవలి కాలంలో జలమండలి, జీహెచ్ఎంసీ, పీసీబీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు తీసుకుంటున్న కొన్ని చర్యలు నీటినాణ్యత స్వల్పంగా మెరుగు పడేందుకు కారణమని పీసీబీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నగరంలో రోజువారీగా ఉత్పన్నమవుతున్న 1800 మిలియన్ లీటర్ల మురుగు నీటిలో సగానికి పైగా జలమండలి నిర్వహిస్తున్న

22 ఎస్టీపీల్లో శుద్ధిచేసి మూసీలోకి వదలడం కూడా నాణ్యత పెరిగేందుకు మరో కారణమని భావిస్తున్నారు.జిల్లా అనంతగిరి కొండలు మూసీ జన్మస్థానం. అక్కడి నుంచి సుమారు 95 కి.మీ ప్రవహించి.. బాపూఘాట్ వద్ద మూసీ నగరంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి ప్రతాపసింగారం వరకు సుమారు 44 కి.మీ మేర నగరంలో నది ప్రవహిస్తోంది. ఈ మార్గంలోనే నదిలోకి గృహ, వాణిజ్య, పారిశ్రామిక వాడల నుంచి వ్యర్థ జలాలు చేరడమే మూసీ పాలిట శాపంగా పరిణమిస్తోంది. ఈ పరిస్థితిని సమూలంగా మార్చేందుకు తక్షణం మాస్టర్‌ప్లాన్ సిద్ధంచేసి దాని ప్రకారం మురుగు శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఈటీపీ) నిర్మాణంతో పాటు సుందరీకరణ పనులు చేపడితేనే మూసీ నది ఉత్తరాదిలోని గంగా, సబర్మతి నదుల తరహాలో మెరుస్తుందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించాలని స్పష్టం చేస్తున్నారు.

# నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి

ఆత్మకూరు మాంసపు విక్రయదారులు నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన మాంసాన్ని మాత్రమే నిర్వహించాలని ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాంసపు విక్రయదారులు ఆదేశించారు. ఆత్మకూరు పట్టణంలోని మాంసపు విక్రయ దుకాణాలను ప్రజారోగ్య సిబ్బందితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మాంసపు విక్రయదారుల తో ఏర్పాటుచేసిన సమావేశంలో వారికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మాంసపు విక్రయ దుకాణాలలో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడకుండా నుంచి వేరు చేసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు డిస్పోజ్ చేయాలన్నారు పట్టణంలోని చికెన్ సెంటర్ లోని వ్యర్థాలను ప్రతిరోజు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఒక వాహనాన్ని ఏర్పాటు చేసి చికెన్ వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తామని తెలిపారు ఇందుకుగాను వ్యాపారుల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ అసిస్టెంట్ ఇంజనీర్ ఓబులేసు శానిటరీ ఇన్స్పెక్టర్ జీవన్ శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏసీబీ దాడులు

ఏలూరు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు జరిపారు. మున్సిపల్ కార్పోరేషన్ లోని పట్టణ ప్రణాళిక విభాగంలో తనిఖీలు చేసారు. గత కొన్ని రోజులుగా ఏలూరు నగర పాలక సంస్థ పై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఏసీబీ కొరడా ఝులూపించింది. ఈ దాడుల్లో ఎసిబి డీఎస్పీ టిఎస్ఆర్ కే ప్రసాద్, సీఐ లు ఎన్వీ భాస్కర్ రావు, కే నాగేంద్ర ప్రసాద్, మరియు సిబ్బంది పాల్గోన్నారు.

# పటాన్ చెరులో విషాదం.. ఉరేసుకుని ముగ్గురి ఆత్మహత్య

సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరు మండలం భానూరులో విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను తల్లి రేఖ (28), కుమార్తె (2), రేఖ మరిది బాసుదేవ్ (27)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. వీరంతా మధ్యప్రదేశ్ చెందిన వలస కూలీలని పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది

# జిల్లా ఎస్.పి కి గ్రామస్తుల కృతజ్ఞతలు

కడప వృద్ధ మహిళ ఆవేదనను సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ ఆపన్న హస్తం అందించారు. వివరాల్లోకెళితే.. బ్రహ్మంగారి మఠం పోలేరమ్మ నగర్ కు చెందిన షేక్ మస్తాన్ బి తన ఆర్థిక ఇబ్బందులను తెలియచేస్తూ సోషల్ మీడియా లో మాట్లాడిన వీడియో వైరల్ గా మారి జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ దృష్టికి రావడంతో చలించిపో యారు. తక్షణమే స్పందించిన జిల్లా ఎస్.పి మైదుకూరు డి.ఎస్.పి ఎస్.ఆర్ వంశీధర్ గౌడ్, మైదుకూరు రూరల్ సి.ఐ నరేంద్ర రెడ్డి లతో మాట్లాడి హుటాహుటిన బ్రహ్మంగారి మఠం కు వెళ్లి షేక్ మస్తాన్ బి కి సాయం అందించాల్సిందిగా ఆదేశించారు. వెంటనే వృద్ధురాలి ఇంటికి వెళ్లి నెల రోజులకు సరిపడా బియ్యం, సరుకులను అందచేశారు. అనంతరం సంబంధిత అధికారు లతో మాట్లాడి వృద్ధురాలికి పెన్షన్ వచ్చేలా కృషి చేశారు. జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ మానవతా దృక్పథంతో ప్రత్యేక చొరవ తీసుకుని వృద్ధురాలికి సాయం చేయడంతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి పెన్షన్ వచ్చేలా చేసినందుకు వృద్ధురాలు షేక్ మస్తాన్ బి తో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్.పి కృతజ్ఞతలు తెలిపారు

# వరలక్ష్మీ వ్రతం మగళకరం

విశాఖపట్నం శ్రావణ మాసం లో ప్రతి ఇంట భక్తి శ్రద్ధలతో నిర్వహించే వరలక్ష్మి వ్రతం మహిళలకు అత్యంత మంగళకరం అని ప్రముఖ సంఘ సేవకులు, వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్ అన్నారు. గురువారం పాతనగరంలోని వివేకానంద అనాథ, వృద్ధాశ్రమంలో అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు సమకూర్చిన బంగారు కాసులు, పట్టు చీరలు సంస్థ మహిళా సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇక్కడ ఉన్న వృద్ధులు, అనాథలకు నిరంతరం సేవలందిస్తున్న మహిళా సభ్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. కరోనా లో సైతం వీరు నిరంతరం ప్రాణాలు ఎదురొడ్డి ఎంతో మందికి తమ సేవలు అందించారన్నారు. గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ తమ పరిధి మేరకు ఇతరులకు సహాయం చేయాలన్నారు. ధనం శాశ్వతం కాదని చేసిన దానం మాత్రమే శాశ్వతంగా నిలిచి పోతుందన్నారు. గతంలో కూడా ఈ ఆశ్రమానికి తన వంతు విరాళంగా నిధులు, మంచాలు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ అహ్మద్, సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన సదస్సు

గూడూరు స్వాతంత్ర సమరంలో భారతీయ జెండా యొక్క విశిష్టత తెలియజేసేందుకు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ తెలిపారు . గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ జెండా పై అవగాహన సదస్సు నిర్వహించారు .దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది . ఈ కార్యక్రమాల్లో భాగంగా మన జాతీయ జెండా యొక్క ఆవశ్యకతను తెలియజేసే అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు . ఈ క్రమంలో గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ మాట్లాడుతూ మన జాతీయ జెండా రూపొందించేందుకు మన ఆంధ్రుడు అయినటువంటి పింగళి వెంకయ్య 30 దేశాల యొక్క జాతీయ జెండా ల పై పరిశోధనలు జరిపి మన జాతీయ జెండా రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు . జాతీయ జెండా ద్వారా మన దేశం యొక్క గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసే విధంగా రూపొందించడం జరిగిందని వివరించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# నిబంధనలను పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలి. ఎస్ఎఫ్ఐ.



డోన్ ఆగస్ట్ 4 ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి విద్యాసంస్థలను బుక్స్టాళ్లుగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేల రూపాయలు దోచుకుంటున్న విద్యాసంస్థల యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, తెలుగు.విజయకుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధు శేఖర్ లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రభాకర్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి బుక్క పేరుతో వేలకు వేల రూపాయలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతుంటే వీటిని అరికట్టవలసిన మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ మాత్రం చోద్యం చూస్తూ, ప్రైవేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారు. గతంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో, అధిక ఫీజులు వసూలు చేయకూడదని, పాఠ్యపుస్తకాలు అమ్మ రాదని వినతి పత్రాలు ఇచ్చినా కూడా అది ఏవీ లెక్కచేయకుండా తూతూ మంత్రంగా మీటింగ్లో పెట్టి పుస్తకాలను స్కూళ్లలో కాకుండా బయట పెట్టుకుని అమ్ముకునే విధంగా వారికి సలహాలు ఇచ్చి విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి పరోక్షంగా ప్రైవేట్ విద్యా సంస్థలకు డోన్ ఎమ్ ఈ ఓ సహకరిస్తున్నారు. ఈ విధంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యానికి ఎమ్ ఈ ఓ కీలుబొమ్మగా మారడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా తక్షణమే ఎమ్ ఈ వో కల్లబొల్లి మాటలు కట్టి పెట్టి ప్రైవేట్ విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులను ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ నుంచి కాపాడాలని, లేని పక్షంలో విద్యార్థులను , విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి ఎమ్ ఈ ఓ కార్యాలయం ముట్టడిస్తామని, నిద్రపోతున్న ఎమ్ ఈ ఓ ని మేల్కొలుపుతామని హెచ్చరిస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ఉదయ్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు సునీల్ కుమార్, సుదర్శన్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



. కర్నూలు, ఆగస్ట్ 05:- ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికి.... బాల్య వివాహాలు ఇంకా జరుగుతున్నాయని, అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం బాగా పని చేయాలని అయితే సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో ఇంకా బాగా పనిచేసి బాల్య వివాహాలను వందశాతం అరికట్టాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్ పర్సన్ డా. కేసలి అప్పారావు ఆదేశించారు..ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్ పర్సన్ మాట్లాడుతూ బాల్య వివాహాల మీద విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు కర్నూలు జిల్లాకు రావడం జరిగిందని అన్నారు. ఆర్థిక అసమానతలు, నిరక్షరాస్యత, బాలికలను జాగ్రత్తగా పెంచలేమన్న అభద్రతా భావం, భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న బెంగ ఇలా పలు కారణాలతో రాష్ట్రంలో బాల్య వివాహాలు పెరుగుతున్నాయి. ప్రతి నెల గ్రామస్థాయిలో వీఆర్వో, సెక్రెటరీ, మహిళ పోలీస్, వాలంటీర్లు అలాగే మండల స్థాయిలో తహశీల్దార్, మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారి, సబ్ ఇన్స్పెక్టర్ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలికల సంక్షేమానికి అందుబాటులో ఉన్న పథకాలు, చిన్న వయస్సులో వివాహం వల్ల కలిగే నష్టాల. గురించి ప్రజలకు తెలియచేసి వారిని చైతన్య పరచలన్నారు. అందుకు అనుగుణంగా అయా మండల, గ్రామ అధికారులకు ఆదేశాలు జారీచేయాలని జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి వారిని ఆదేశించారు.

. మహిళాశిశు సంక్షేమ శాఖ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో 2011 నుంచి 2022 వరకు 275 బాల్య వివాహాలు గుర్తించగా అందులో 220 బాల్య వివాహాలు ఆపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా,మండల,గ్రామ స్థాయిలో అధికారులందరూ సమన్వయంతో కృషి చేసి బాల్య వివాహాలను అరికట్టి ప్రజలలో చైతన్యం తీసుకొని రావడానికి గ్రామ, మండల స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు... .

## సచివాలయ ఉద్యోగుల ను రెగ్యులర్ చేసినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఉద్యోగులు..

తుగ్గలి ఆగస్టు 04. తుగ్గలి మండల పరిధిలోని శభాష్ పురం గ్రామ సచివాలయంలో, సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వము రెగ్యులర్ చేయడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి గురువారము సచివాలయ ఉద్యోగులు పాలాభిషేకం చేశారు .ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పవతి, మాజీ సర్పంచ్ హనుమంతు లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సచివాలయ ఉద్యోగులు అందరిని రెగ్యులర్ చేసి వారికి ఆగస్టు 1వ తేదీ న కొత్త జీతాలు ఇవ్వడం జరిగిందన్నారు .అందువల్ల సచివాలయ ఉ ద్యోగులు ప్రభుత్వ పథకాలును ప్రజలకు అందే విధంగా చూస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు.



## కామ్రేడ్ షడ్రక్ రెండవ వర్ధంతి. సిపిఎం



డోన్ ఆగస్ట్ 4పట్టణంలోని సీపీఎం ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ షడ్రక్ రెండవ వర్ధంతి స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సి పీ ఎం సీనియర్ నాయకులు కొండయ్య, జిల్లా నాయకులు శివరాం, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సి ఐ టీ యూ మండల అధ్యక్ష కార్యదర్శులు నాగ మద్దయ్య, రామాంజనేయులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిన్న రహిమాన్, మహిళ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేమిమ్ బేగం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గౌసియా, దేవి లక్ష్మీ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు అశోక్, విజయ్, ఉదయ్, ఇర్ఫానబేగం మరియు తదితరులు పాల్గొన్నారు.

# మ్యుటేషన్స్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

**రీ సర్వే పనులను వేగవంతం చేయండి భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వేపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించిన సీసీఎల్ఏ జి. సాయి ప్రసాద్**

కర్నూలు ఆగస్టు 05:భూ క్రయవిక్రయాలు జరిగి రెవెన్యూ రికార్డులో మార్పుకు సంబంధించిన మ్యూటేషన్ దరఖాస్తుల మీద ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ జి. సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుండి సీసీఎల్ఎ జి. సాయి ప్రసాద్ సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి మ్యుటేషన్స్, జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథక రీ సర్వే పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ మ్యుటేషన్స్ కు సంబంధించిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు భూముల సమగ్ర రీ సర్వే పనులను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం కింద రెవెన్యూ భూముల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే భూ రికార్డుల స్వచ్ఛీకరణ, గ్రౌండ్ వ్యాలీడేషన్, 13 నోటిఫికేషన్, ఓఆర్ఐ ప్రక్రియను నిర్ణీత సమయంలోపు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు మాట్లాడుతూ మ్యుటేషన్స్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. భూముల రీసర్వే పనుల వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారుకర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, డి ఆర్ ఓ నాగేశ్వర రావు,ల్యాండ్ సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రైటర్ ఎంట్రీతో టెన్షన్ లో మెగా ఫ్యాన్స్..!



మెగాస్టార్ చిరంజీవి రెండేళ్ల విరామం తరువాత 'ఆచార్య' మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. స్టార్ డైరెక్టర్ కొరటాల శివ డైరెక్ట్ చేసిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య విడుదలై అభిమానుల్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. ఊహించని విధగంగా డిజాస్టర్ గా రిలవడంతో ఫ్యాన్స్ ఆ గాయం నుంచి ఇంకా కోలుకోలేకపోతున్నారు. భారీ అంచనాలు పెట్టుకున్న సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్ మారడం ఇప్పటికీ ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారట. ఈ నేపథ్యంలో ఓ వార్త మెగా ఫ్యాన్స్ ని మరింత టెన్షన్ కు గురిచేస్తోంది. కారణం రైటర్ కమ్ డైరెక్టర్ బీవీఎస్ రవి అని తెలుస్తోంది. గత కొంత కాలంగా బీవీఎస్ రవి హ్యాండ్ పెట్టిన ప్రతీ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడుతున్నాయి. ఆశించిన స్థాయిలో ఆకట్టుకోవడం లేదు. అంతే కాకుండా రీసెంట్ గా ఆయన కథ అందించిన సినిమా 'థాంక్యూ' ఇటీవల విడుదలై తీవ్ర నిరాశకు గురిచేసింది. నాగచైతన్య హీరోగా విక్రమ్ కె. కుమార్ డైరెక్షన్లో స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ మూవీని నిర్మించారు. ఇంత మంది పక్కాగా ప్లాన్ చేసినా బీవీఎస్ రవి అందించిన కథ సినిమాను నిలబెట్టలేకపోయింది. దర్శకుడిగానూ పరిచయం అవుతూ గోపీచంద్ హీరోగా 'వాంటెడ్' మూవీని రూపొందిస్తే అది అట్టర్ ఫ్లాప్ అయింది. రైటర్ గా తను ఇటీవల చేసిన సినిమాలేవీ ఆశించిన ఫలితాల్ని అందించకపోవడంతో మెగా ఫ్యాన్స్ ఇప్పుడు కంగారు పడుతున్నారట. వారి కంగారుకు కారణం ఏంటంటే మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న రెండు క్రేజీ సినిమాలకు బీవీఎస్ రవి వర్క్ చేస్తున్నారు. మెహర్ రమేష్ డైరెక్షన్ లో రూపొందుతున్న 'భోళా శంకర్' బాబీ రూపొందిస్తున్న 'వాల్తేరు వీరయ్య' చిత్రాల కథల్లో బీవీఎస్ రవి హస్తం వుంది. 'భోళా శంకర్' తమిళ రీమేక్ అయినా తెలుగు నేటి విటీకి అనుగుణంగా బీవీఎస్ రవి దర్శకుడు మెహర్ రమేష్ మార్పులు చేశారట. ఇక 'వాల్తేరు వీరయ్య'దీ ఇదే పరిస్థితి. ఈ సినిమాకు కోన వెంకట్ కె. చ్రవర్తి రెడ్డి స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. దర్శకుడు బాబి కథ అందించినా అందులో రవి హ్యాండ్ వుందట. ఇప్పుడు ఇదే మెగా ఫ్యాన్స్ ని టెన్షన్ కు గురిచేస్తోంది. 'ఆచార్య'తో డిజాస్టర్ ని ఎదుర్కొన్న చిరు వెంటనే హిట్ కొట్టాలని ఎదురుచూస్తుంటే చిరు నుంచి రానున్న రెండు ప్రాజెక్ట్ లలోకి స్క్రిప్టుకు రైటర్ బీవీఎస్ రవి ఎంట్రీ ఇవ్వడం ఫ్యాన్స్ ని షాక్ కు గురిచేస్తోందట.


# 'ది లెజెండ్' పాన్ ఇండియా వెనుక బిజినెస్ స్ట్రాటజీ !



తమిళ వ్యాపార వేత్త శరవణన్ ఇటీవలే 'లెజెండ్' సినిమాతో హీరోగా పరిచయమైన సంగతి తెలిసిందే. సినిమా ఫలితం సంగతి పక్కనబెడితే...ఇతరు హీరో? ఏంటి? అతను హీరో మెటీరియల్ నా? పైగా 80 కోట్లు పెట్టి పాన్ ఇండియా సినిమానా? ఇతనికి ఏమైనా పిచ్చా? వెర్రా! అంటూ నెట్టింట పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కున్నాడు. ట్రోలింగ్ కి గురయ్యాడు. మరి ఈ సినిమా వెనుక బిజినెస్ స్ట్రాటజీ ఉందా? 'లెజెండ్' సినిమా చేయడంలో శరవణన్ బిజినెస్ ప్లాన్ దాగిందా? పిచ్చోడు అతను కాదు..ట్రోల్ చేసిన వాళ్లు అని అంటారా? అంటే అవుననే టాక్ వినిపిస్తుంది. శరవణన్ ముందు పెద్ద సక్సెస్ ఫుల్ బిజినెస్ మ్యాన్. ఆ తర్వాతనే సినిమా నటుడైనా.. ఇంకేదైనా? సౌత్ లో శరణవన్ స్టోర్స్ పేరిట కోట్ల రూపాయాల వ్యాపారం జరుగుతుంది. అందులోనూ చెన్నైలో స్టోర్స్ ఎక్కువ. ఇంకా సౌత్ లో కొన్ని మెట్రోపాలిటిన్ సిటీస్ లో శరవణన్ వ్యాపారానికి తిరుగు లేదు. అంతటి వ్యాపార వేత్త సినిమాల్లోకి పెద్ద స్టార్ అయిపోదామని ఊరకనే రాలేదు. దీని వెనుక బిజినెస్ స్ట్రాటజీ ఉందని తెలుస్తోంది. తన బిజినెస్ కి సంబంధించి అతనే యాడ్ షూట్ లో స్వయంగా నటిస్తాడు. ఆయాడ్ లో శరవణన్ తో పాటు ఇద్దరు హీరోయిన్లు కూడా తప్పనిసరి. బిజినెస్ కి సంబంధించి ఇలాంటి యాడ్స్ తప్పనిసరి. శరవణన్ ఇలాంటి యాడ్స్ కి ఒక్కో దానికి 5 నుంచి 10 కోట్లు ఖర్చు చేస్తుంటాడు. అలా పాన్ ఇండియా వైడ్ డివైడ్ చేసి యాడ్స్ చేయాలంటే తడిపిమోపుడు అవుతుంది. 200 కోట్లకు పైగానే కేటాయించాలి. స్థానిక భాషల హీరోయిన్లని ఎంపిక చేసుకోవాలి. ఓ పేరున్న డైరెక్టర్నీ ఒప్పించాలి. వాళ్లకి భారీగా పారితోషికం చెల్లించాలి. ఇంకా టెక్నికల్ గా ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఇలా అన్ని భాషల్లో యాడ్స్ చేయడం అంటే చిన్న విషయమా? అందులోనూ ఉత్తరాది రాష్ట్రాల్లో ఫేమస్ అవ్వడం అంటే అంత ఈజీ కాదు. బోలెడంత ఖర్చు. అవన్నీ కలిసి రావాలంటే సినిమా ఒక్కటే మార్గంగా భావించి పాన్ ఇండియాలో 'ది లెజెండ్' సినిమా చేసాడు. అలాగని ఈ సినిమాతో ఆయనేమి సూపర్ స్టార్ కాలేదు. పెట్టిన పెట్టుబడి సంగతి పక్కనబెడితే సినిమాకి అన్ని వైపులా నష్టాలే వచ్చాయి. కానీ ఈ సినిమాతో శరవణన్ అనే అతను ఉ న్నాడు? అన్న సంగతి జనాల్లోకి వెళ్లే ఛాన్స్ ఉంటుందిగా. ఆ ఐడెంటిటీని తన వ్యాపారానికి ఎంతో కొంత ఉపయోగపడే అవకాశమైతే ఉంటుందిగా. మరో సినిమా చేసి ఇంకాస్త ఐడెంటిటీని బిల్డ్ చేయడానికి ఛాన్స్ ఉంది. లక్కీగా సక్సెస్ అయితే గనుక ఆ ఇమేజ్ తో తన బిజినెస్ బ్రాండింగ్ ల్ని తానే స్వయంగా ప్రమోట్ చేసుకోవడానికి అవకాశం ఉంది. ఇలా ఇన్ని లాజిక్ లు మధ్య శరవణన్ ముఖానికి మాత్రమే రంగు వేసుకున్నాడు. మనసుకి కాదు.

# 'పుష్ప 2' లో సమంత..? సుక్కూ అలాంటి ప్లాన్ చేస్తున్నాడా..?

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ మరియు స్టార్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ మూవీ "పుష్ప: ది రైజ్". ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్ గా నటించగా.. మలయాళ విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్ విలన్ గా కనిపించారు. ఈ యాక్షన్ మూవీ బాక్సాఫీస్ వద్ద ఎంతటి ఘనవిజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన అన్ని భాషల్లోనూ 'పుష్ప' పార్ట్-1 మంచి వసూళ్లను రాబట్టింది. ముఖ్యంగా హిందీలో ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి సంచలన విజయం నమోదు చేసింది. పుష్ప.. పుష్పరాజ్.. తగ్గేదేలే వంటి పలు డైలాగ్స్ ఇప్పటికీ



ట్రెండింగ్ లో ఉన్నాయంటే.. పుష్ప మ్యానియా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.'పుష్ప 1' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత రెండో భాగం 'పుష్ప: ది రూల్' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు అందరూ సెకండ్ పార్ట్ ఎప్పుడు సెట్స్ మీదకు వెళ్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సుక్కూ అండ్ టీమ్ ఎంతో జాగ్రత్తగా స్క్రిప్ట్ రెడీ చేస్తున్నారని తెలుస్తోంది. మొదటి భాగాన్ని మించి భారీ స్థాయిలో రెండో భాగాన్ని తీర్చిదిద్దాడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే సుకుమార్ ఈ స్క్రిప్ట్ ను డెవలప్ చేసే పనిలో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. యాక్షన్ - ఎలివేషన్ సీన్స్ మరియ ఎమోషన్స్ ఈ భాగంలో హైలైట్ గా నిలిచే అవకాశం ఉందని టాక్. ఇందులో భాగంగా 'పుష్ప 1' లో మిగిలిన పాత్రలను కొనసాగిస్తూనే.. మరికొంతమంది స్టార్ కాస్ట్ ను భాగం చేయనున్నారని తెలుస్తోంది. రష్మిక మందన్నా శ్రీవల్లి పాత్రతో పాటుగా భన్వర్ లాల్ షెకావత్ - మంగళ శీను - దాక్షాయని పాత్రలు కంటిన్యూ అవ్వనున్నాయి. కొత్తగా మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కూడా జాయిన్ అవుతాడని టాక్ నడుస్తోంది. అయితే లేటెస్టుగా వినిపిస్తున్న రూమర్స్ ప్రకారం 'పుష్ప 2' లో సమంత రూత్ ప్రభు కూడా కొనసాగవచ్చని అంటున్నారు. పార్ట్-1 లో 'ఊ అంటావా మావా.. ఊఊ అంటావా' అనే ఐటమ్ సాంగ్ లో సామ్ ఆడిపాడిన సంగతి తెలిసిందే. ఒక్క పాటతో నేషనల్ వైడ్ ఊపేసిందని చెప్పాలి. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'పుష్ప: ది రూల్' సినిమాలోనూ సమంత పాత్రను కొనసాగించాలని సుకుమార్ తన బృందంతో చర్చలు జరుగుతున్నారట. పుష్పరాజ్ కి సహాయం చేసే స్నేహితురాలిలా ఆమె పాత్రను డెవలప్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారట. అంతేకాదు పుష్పరాజ్ భార్య అయిన శ్రీవల్లి సినిమా ప్రారంభమైన మొదటి 20 నిమిషాల్లో చనిపోతుందట. కాకపోతే పుష్ప ఇన్నర్ మైండ్ గా ఆమె క్యారక్టర్ చివరి వరకూ ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలోనే సామ్ పాత్రను ఇన్వాల్వ్ చేయాలని అనుకుంటున్నారట. ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే. ఇకపోతే సుకుమార్ ఫ్రెంచ్ సినిమాలు మరియు లాటిన్ అమెరికన్ సినిమాలన్నింటినీ రిఫరెన్స్ గా తీసుకొని 'పుష్ప 2' స్క్రిప్ట్ ను రాస్తున్నాడని టాక్ నడుస్తోంది. శేషాచలం అడవుల్లో కూలీగా జీవితాన్ని ప్రారంభించిన పుష్పరాజ్.. ఎర్ర చందనం స్మగ్లింగ్ సిండికేట్ ను శాసించే స్థాయికి ఎలా ఎదిగాడనేది 'పుష్ప: ది రైజ్' లో చూపించారు. ఇప్పుడు రెండో భాగంలో శత్రువులను ఎదుర్కొని ఎలా రూల్ చేసాడనేది చూపించబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో ఈ సినిమా రూపొందనుంది. రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. త్వరలోని ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ని సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం కోసం తాత్కలికంగా షూటింగ్స్ బంద్ చేసిన నేపథ్యంలో.. సమ్మె ముగిసిన తర్వాత 'పుష్ప 2' రెగ్యూలర్ షూటింగ్ పై క్లారిటీ రానుంది.

# రోహిత్ బాటలోనే కేఎల్ రాహుల్.. హార్దిక్‌కు ప్రమోషన్!



వైట్‌బాల్ క్రికెట్‌లో బీసీసీఐ టీమిండియా వైస్‌కెప్టెన్‌గా కేఎల్ రాహుల్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. కానీ అతను వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఒక్క మ్యాచ్ సరిగ్గా ఆడింది లేదు. అయితే ఫిట్‌నెస్ సమస్య.. లేదంటే తరచూ గాయాల బారిన పడడం ఇలా ఏదో ఒకటి జరుగుతూనే ఉంది. ఇక రోహిత్ శర్మ కూడా టీమిండియాకు అన్ని ఫార్మాట్లకు రెగ్యులర్ కెప్టెన్ అయినప్పటి నుంచి అతను కూడా ఫిట్‌నెస్, గాయాలు ఇలా ఏదో ఒక కారణంతో అప్పుడప్పుడు దూరమవుతూనే వస్తున్నాడు. తాజాగా కేఎల్ రాహుల్ కూడా తన కెప్టెన్ బాటలోనే నడుస్తున్నాడు. కనీసం రోహిత్ ఏదో ఒక సిరీస్ ఆడుతున్నప్పటికి.. రాహుల్ మాత్రం ఒక్క సిరీస్ ఆడకుండానే దూరమవుతూ వస్తున్నాడు. ఇక రోహిత్ లేని సమయాల్లో వైస్ కెప్టెన్ జట్టును నడిపించాల్సి ఉంటుంది. మంచి నాయకత్వం ప్రదర్శిస్తాడని రాహుల్‌ను ఎంపిక చేస్తే అతనేమో తరచూ గాయాలపాలవుతూ జట్టుకే ఇబ్బందిగా మారాడు. ఇలాగే కొనసాగితే టీమిండియాకు నష్టమని బీసీసీఐ భావిస్తోంది. దీంతో రానున్న టి20 ప్రపంచకప్‌కు రోహిత్‌కు డిప్యూటీగా ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యాను ఎంపిక చేయాలని బీసీసీఐ యోచిస్తుంది. అంతకముందే ఆసియాకప్ 2022కు కూడా పాండ్యాను వైస్‌కెప్టెన్‌గా ఎంపిక చేస్తారనే వార్తలు వస్తున్నాయి. ఇక రీఎంట్రీ తర్వాత అద్భుతాలు చేస్తున్న పాండ్యా.. రోహిత్ డిప్యూటీగా పనికొస్తాడని సెలక్టర్లు నమ్ముతున్నారు. అదీగాక అతడిలో సారథ్య లక్షణాలు కూడా పుష్కలంగా ఉన్నాయని సెలక్టర్లు నమ్ముతున్నారు. ఇటీవలే ఐర్లాండ్‌తో టి20 సిరీస్‌ను టీమిండియా పాండ్యా సారథ్యంలో 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అంతకముందు ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ కు సారథిగా వ్యవహరించిన హార్దిక్.. జట్టుకు టైటిల్ అందించి తానేంటో నిరూపించుకున్నాడు. కానీ కెఎల్ రాహుల్ మాత్రం సారథిగా ఇంకా పూర్తిస్థాయిలో నిరూపించుకోలేదు. రోహిత్ లేని సందర్భాల్లో టీమిండియాకు కెప్టెన్ (దక్షిణాఫ్రికా సిరీస్ లో) గా వ్యవహరించిన కేఎల్ రాహుల్ సారథ్యంలో భారత్.. 0-3తేడాతో ఓడింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**